
సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 16 । మార్చి । 2024



బ్రహ్మోత్సవాలకు వేళాయె..
తెలంగాణలో రెండో తిరుపతి దేవస్థానంగా పేరుగాంచిన చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో▸



చొక్కా చించి..ఫైళ్లు విసిరేసి..
కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండా తల్లి సహకారంతో సోదరి పేరిట రిజిస్ట్రేషన్ ఎలా చేశారంటూ నాయబ్ తహసీల్దార్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36^{0} /24^{0}

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.



హస్తం టికెట్ ఎవరికో..!


వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ

- ఇప్పటికే ఏఐసీసీకి మూడు పేర్లు పంపిన టీపీఈసీ
- దొమ్మాటి సాంబయ్య, ఇందిర మధ్య పోటీ.. తాజాగా తెరపైకి బొడ్డు సునీత
- జాబితాలోసర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌ను చేర్చిన టీపీసీసీ
- ఓరుగల్లు నుంచి ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు..
- ఎమ్మెల్యేల నోట రామగల్ల పరమేశ్వర్, పుల్లా శోభన్‌కుమార్ పేర్లు
- అరడజన్ దాటిన ఆశావహులు..
- నేడు సాయంత్రం వరకు కొలిక్కి వచ్చే అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

పార్లమెంట్ ఎన్నికల ముహూర్తం దగ్గర పడింది. నేడు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు మూడు రోజుల్లో అన్ని పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించే పనిలో తలమునకలయ్యాయి. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోరిక బలరాంనాయక్(కాంగ్రెస్), అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ), మాలోతు కవిత(బీఆర్ఎస్)ను ఖరారు చేయగా.. వరంగల్ పార్లమెంట్ కోసం ఒక్క బీఆర్ఎస్ మాత్రమే కడియం కావ్యను అభ్యర్థిగా ప్రకటించింది. ఇంతకాలం వేచిచూసే ధోరణిని ప్రదర్శించిన కాంగ్రెస్, బీజేపీ అధిష్టానాలు నేడో, రేపో ఖరారు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశాయి. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ అభ్యర్థి కోసం పోటీ రోజురోజుకూ తీవ్రమవుతుండగా.. 18వ తేదీలోపు ప్రకటన చేసేందుకు తాజాగా ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. దీంతో వరంగల్ సీటు ఎవరిని వరిస్తుందనేది ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

పెరుగుతున్న ఆశావహులు..
త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు 20 రోజుల క్రితం నమిండ్ల శ్రీనివాస్, దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర పేర్లు తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ(టీపీఈసీ) అధిష్టానానికి పంపిందన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత అద్దంకి దయాకర్, సర్వే సత్యనారాయణ పేర్లు కూడా పరిశీలించాలని అధిష్టానంలోని కొందరు పెద్దల సూచన మేరకు వారి పేర్లను చేర్చారు. అయితే సుమారు మూడు నెలల క్రితం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా వరంగల్ ఎంపీ సీటు కోసం 64 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో పైన పేర్కొన్న పేర్లతో పాటు రామగళ్ల పరమేశ్వర్, బొడ్డు సునీత, జన్ను పరంజ్యోతి, జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, పోలీసు ఉన్నతాధికారి పుల్లా శోభన్ కుమార్ తదితరులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకుని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే పార్టీ అధిష్టానం మాత్రం అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటోంది. సామాజిక సమీకరణాలు.. అంగ.. అర్థబలం ఆధారంగా బలమైన నాయకులను బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా జాబితాను వెల్లడించేందుకు సిద్ధమవుతోన్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ.. పోటీకి ఉత్సాహం చూపుతున్న నాయకులను స్కాన్ చేస్తున్నది. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ప్రత్యర్థులకు దీటైన అభ్యర్థులను రంగంలోకి దించాలని పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే గాంధీభవన్‌లో పలుమార్లు డీసీసీ అధ్యక్షులు, ముఖ్యనేతలతో సమావేశం కాగా.. అభ్యర్థుల ఎంపిక విషయంలో వారి అభిప్రాయాల్ని తెలిపారు. పోటీ తీవ్రం కావడంతో తాజాగా రెండు రోజుల నుంచి ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరిస్తుండటం కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎంపిక రసకందాయంలో పడింది.



దరఖాస్తుల వడపోత..
రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలవడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్న అధికార పార్టీ కాంగ్రెస్.. ఆదిశగా వరంగల్ ఎంపీ స్థానంపై కసరత్తు ముమ్మరం చేసింది. ఆశావహుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వడపోస్తోంది. మొదట ఏఐసీసీకి పంపిన మూడు పేర్లలో సింగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య పేర్లను టీపీఈసీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే తాజాగా ఎమ్మెల్యేల సూచన మేరకు పోలీసు ఉన్నతాధికారి, కమలాపూర్ మండలం ఉప్పల్‌కు చెందిన పోలీసు ఉన్నతాధికారి పుల్లా శోభన్‌కుమార్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, సెయింట్‌పాల్స్ విద్యాసంస్థల అధినేత బొడ్డు సునీత పేర్లపై కూడా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దొమ్మాటి సాంబయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వారి సన్నిహిత ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతుండగా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కతో పాటు మల్లికార్జున్ ఖర్గేను కలిసిన సింగపురం ఇందిర తనకే అవకాశం ఇవ్వాలని పట్టుబడుతోంది. ఇదే సమయంలో టీపీఈసీ కమిటీలో కీలక సభ్యులతో పాటు ఉమ్మడి వరంగల్ మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టిన డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, పుల్లా శోభన్‌కుమార్ కూడా సీరియస్‌గానే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈనెల 18లోగా అధిష్టానం పార్లమెంట్ అభ్యర్థులను ఖరారు చేయాలని భావించిన నేపథ్యంలో సాంబయ్య, ఇందిర, సునీత, శోభన్‌కుమార్, పరమేశ్వర్‌లలో ఒకరిని ఖరారు చేస్తారన్న చర్చ కేడర్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్..?

వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి కడియం కావ్య పేరును ప్రకటించడంతో ఆ పార్టీ సీనియర్ నేత, వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ తదితరుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వరంగల్ పార్లమెంట్ సీటు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాదిగలకు అన్యాయం చేశారన్న అసంతృప్తి వ్యక్తం చేసిన దయాకర్.. సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం కలకలం రేపుతోంది. కాగా మాజీ ఎమ్మెల్యేలు డా.టి.రాజయ్య, అంతకు ముందు మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ అగ్రనేతలను కలవగా.. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బీజేపీ వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో వరంగల్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం ఉమ్మడి వరంగల్‌లో బీఆర్ఎస్‌కు మరో పెద్ద షాక్‌గా తగులుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ. 14.63 లక్షలు



లెక్కింపు నిర్వహిస్తున్న దేవాదాయశాఖ ఉద్యోగులు, సేవాసమితి సభ్యులు

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగిన మహాశివరాత్రి బ్రహోత్సవాల ఆదాయం రూ.14,63,316 వచ్చినట్లు ఈఓ కె.వెంకటయ్య తెలిపారు. హుండీల్లో భక్తులు వేసిన కానుకలు, పూజా రుసుములు, విరాళాల ద్వారా ఈ మొత్తం లభించిందని చెప్పారు. శుక్రవారం చేపట్టిన లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది, శ్రీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అలాగే గత శుక్రవారం కల్యాణ మండపం ప్రారంభించినందున తిరుగువారాన్ని పురస్కరించుకుని కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోవాలి

న్యూశాయంపేట: గ్రూప్–1 పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శిక్షణా కేంద్రం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మేన శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సి)లు ఉచిత శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. వందమంది అభ్యర్థులకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే 45 రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీ వరకు తమ దరఖాస్తులను హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్‌లోని అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 73309 90322 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

వేతనాలు విడుదల చేయాలి



విద్యారణ్యపురి: ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఈనెల 15 వ తేదీ గడిచినా వేతనాలివ్వలేదని.. ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన ఆ ఉపాధ్యాయ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చే ముందు ఉద్యోగులందరికీ మొదటి తేదీనే వేతనాలిస్తామని.. అన్ని వర్గాల ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు విడుదల చేస్తూ.. ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను విస్మరించడం శోచనీయమన్నారు. వేతనాలు విడుదల కాకపోవడంవల్ల బ్యాంకుల్లో ఈఎంఐలు సకాలంలో చెల్లించడం లేదని, సిబిల్ స్కోర్ పోతోందని, ఫైన్ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్షుడు గుమ్మడవెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు స్వామి, బాధ్యులు వేల్పుల రవీందర్, పూర్ణచందర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ఒకేషనల్ పరీక్షలకు 111 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన వివిధ పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ఒకేషనల్ పరీక్షలకు 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. మొత్తం 780 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 669 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

నేడు జాబ్ మేళా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉచిత జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక



వరంగల్ లీగల్/వరంగల్ అర్బన్ : వరంగల్ ఏసీబీ కోర్టు, హనుమకొండ సబ్ కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే శనివారం(నేడు) జిల్లా కోర్టు ప్రాంగణానికి రానున్నారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, ఎల్.లక్ష్మణ్, ఎస్.రాజేశ్వర్‌రావు హాజరుకానున్నారు. వీరితో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, వై.శ్యాంసుందర్ రెడ్డి, కార్యదర్శులు యాకస్వామి, జి.శ్రీధర్‌రెడ్డి పాల్గొనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం హనుమకొండ కోర్టు ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు జడ్జి రమాదేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ పరిశీలించారు. వారి వెంట హెచ్ఓ రాజేష్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఎ.సరిత ఉన్నారు.

ముందుగానే స్కూల్ డ్రెస్‌లు ఇవ్వాలి

వరంగల్ : పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు ఇవ్వాలని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. డీఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల కొలతలు సరిగా తీసుకుని యూనిఫామ్ కుట్టించాలని మహిళా స్వయం సహాయక సంఘాల బాధ్యులకు సూచించారు. మండల సమాఖ్య, మెప్మా, టీఎల్ఎఫ్ సిబ్బంది, డీపీఎంలు, విద్యాశాఖ, సోషల్, ట్రైబల్, మైనార్టీ అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ అమలుకు కృషి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

రామన్నపేట: వరంగల్ మాస్టర్ ప్లాన్ ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి త్వరలో అమలులోకి వచ్చేలా కృషి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 29వ డివిజన్ రామన్నపేటలో మేయర్ సుధారాణితో కలిసి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.40 కోట్ల నిధులతో వరంగల్, కాజీపేట ప్రాంతానికి హంటర్ రోడ్డు మీదుగా ప్రత్యేక రహదారి నిర్మించడంతో సుమారు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం తగ్గనుందని, ఈ నిధుల మంజూరుకు సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. గత ఏడాది వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కురిసిన వర్షాలతో అనేక కాలనీలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వేసవి కాలంలోనే ముంపు నివారణకు చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రకాళి బండ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. భద్రకాళి దేవాలయం మాడ వీధుల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రితో పాటు అన్ని దేవాలయాలకు కమిటీలు వేసి అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్ద జగన్, డివిజన్ అధ్యక్షుడు ఒరుగంటి పూర్ణ, తోట నవీన్, సంద్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలనూ వదలట్లేదు..!



- చదును చేసి ప్లాట్లుగా విక్రయం
- నిర్మాణాలు చేపట్టిన కొనుగోలుదారులు
- అధికారుల తీరుపై అనుమానాలు

హన్మకొండ చౌరస్తా: ఇప్పటి వరకు చెరువులు, కుంటలను చదును చేసి కబ్జా చేసిన అక్రమార్కులనే చూశాం. ఇప్పుడు ఏకంగా గుట్టనే తొలచి ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారు. ఇదేమీ తెలియని కొందరు గుట్టపై చదును చేసిన స్థలాలను కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా హనుమకొండ పద్మాక్షి గుట్టలు నిలుస్తున్నాయి.

హనుమకొండలోని 7వ డివిజన్ పరిధి లక్ష్మీపురంలో స్వామి వివేకానంద స్కూల్ వెనుకాల కొన్నాళ్లుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే ఓ నాయకుడి 'హస్తం'తోనే గుట్టను తొలిచే పనితో పాటు అక్రమ ఇంటి నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న గుట్టలను గుట్టు చప్పుడు కాకుండా మాయం చేస్తుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సర్వే నంబర్ 898లో సుమారు వంద ఎకరాల్లో పద్మాక్షి గుట్టతో పాటు కొంత ఖాళీ స్థలం ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. కాగా ఈ సర్వే నంబర్‌లో కొత్త స్థలాన్ని 2004 సంవత్సరం కొంతమంది పేదలకు 40 గజాల చొప్పున ఇళ్ల నిర్మాణానికి కేటాయిస్తూ సుమారు 30 కుటుంబాలకు పట్టాలు అందజేశారు. ఇదే అదనుగా కొందరు చోటా నాయకులు అవే పట్టాలను ఎరగా వేసి గుట్టను తొలిచి మరిన్ని పట్టాలు తయారు చేసి అమ్ముతున్నారని తెలిసింది. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి గుట్టను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



7వ డివిజన్‌లోని స్వామివివేకానంద హైస్కూల్ వెనుకాల పద్మాక్షి గుట్టలపై అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

వినియోగదారుల హక్కులు పరిరక్షించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కరీమాబాద్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్రవారం 'వినియోగదారుల కోసం న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈక్రమంలో వినియోగదారుల హక్కుల గురించి రూపొందించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సిద్ధార్థరెడ్డి, సుదర్శన్, దామోదర్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాసరావు, నందకుమారితోపాటు జిల్లాలోని రేషన్ డీలర్లు, గ్యాస్ డీలర్లు, పెట్రోల్ బంక్, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్లలో రామారావు హనుమకొండ నుంచి నల్లబెల్లి, ఎస్.నగేష్ నల్లబెల్లి నుంచి వరంగల్ వీఆర్‌కు, ఇన్‌స్పెక్టర్లలో కరుణాకర్ టాస్క్‌ఫోర్స్ నుంచి సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్, ఎస్.వెంకట్రాం మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

టీఎస్ టు టీజీ షురూ..

- ఫ్యాన్సీ నంబర్లకు పెరిగిన డిమాండ్
- 0009 నంబర్‌కు రూ.1.15 లక్షలు
- వేలంలో కొనుగోలు చేసిన వాహనదారు

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి టీఎస్‌ను టీజీగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం అమలులోకి వచ్చింది. శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ ద్వారానే కొనసాగుతోంది. హనుమకొండ ఆర్టీఏ పరిధిలో శుక్రవారం 61 కొత్త వాహనాలకు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 56 నాన్ ట్రాన్స్‌పోర్ట్, 6 ట్రాన్స్‌పోర్ట్‌వి ఉన్నాయి. దీంతో ఆర్టీఏకు రూ.1,31,535 ఆదాయం వచ్చినట్లు డీటీసీ శ్రీనివాస్ పుప్పాల తెలిపారు.

ఫ్యాన్సీ నంబర్లకు డిమాండ్
ఫ్యాన్సీ నంబర్లకు డిమాండ్ పెరిగింది. 38 మంది ఫ్యాన్సీ నంబర్లకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా వేలం వేయగా టీజీ 0009కు రూ.1.15 లక్షలు, టీజీ 0001 నంబర్‌కు రూ.లక్ష, టీజీ 0006 నంబర్‌కు రూ.32,200, టీజీ 0036 నంబర్‌కు రూ.35,335 చెల్లించి వాహనదారులు దక్కించుకున్నట్లు డీటీసీ పేర్కొన్నారు.

ఫోన్ నంబర్లు ఆన్‌లైన్..



వాహనదారులు దరఖాస్తు చేసిన సమయంలో ఇచ్చిన నంబర్లను వినియోగించుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని, మారిన నంబర్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చుకుంటే ఆర్టీఏ ద్వారా అందే సేవలు తక్షణమే తెలిసే అవకాశం ఉంటుందని డీటీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే వివిధ కారణాలతో డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్ కార్డులు కార్యాలయంలో పేరుకుపోయాయని, దరఖాస్తుల్లో అడ్రస్ సక్రమంగా పేర్కొనకపోవడంతో తిరిగి కార్యాలయానికి వచ్చాయని చెప్పారు. ఈనెల 30వ తేదీ లోపు మధ్యాహ్నం 2 గంటల తర్వాత సంబంధిత ఆధారాలతో వాహనదారులు వచ్చి తమ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కార్డులు తీసుకెళ్లాలని సూచించారు.

అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించాలి

డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పెసరు విజయచందర్‌రెడ్డి

ఎంజీఎం: అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించాలని హనుమకొండ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెసరు విజయచందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కేఎంసీలోని ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈఅవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర సమయాల్లో విద్యార్థులు ఎలా స్పందించాలనే విషయాలపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రతీ పౌరుడు తప్పకుండా ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుశీల, స్టేట్ కో–ఆర్డినేటర్ జి.రమణ, రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ విజయలక్ష్మి, నర్సింగ్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన బల్దియా కమిషనర్



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా నియమితులైన అశ్వినితానాజీ వాకడే శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రగతి కోసం కార్పొరేషన్ చేపడుతున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న ప్రణాళికలను మంత్రికి వివరించారు.

బల్దియా ఏఈలకు పదోన్నతులు
బల్దియాలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు కృష్ణమూర్తి, అజ్మీర శ్రీకాంత్‌కు డిప్యూటీ ఇంజనీర్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఇంజనీరింగ్ చీఫ్(ఈఎన్‌సీ) నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతి పొందిన నేపథ్యంలో డీఈలు శుక్రవారం అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్‌ను మర్యాదపూర్వకంగా కలవగా.. వారికి అదనపు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు లోక్ అదాలత్‌లు

వరంగల్ లీగల్ : జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం (నేడు) లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్, హనుమకొండ కార్యదర్శులు ఎం.సాయికుమార్, జె.ఉపేందర్‌రావు తెలిపారు. రెండు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి హాజరవుతున్నారని, రాజీపడదగు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లా కోర్టులో 8, నర్సంపేట కోర్టులో ఒకటి మొత్తం 9 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే గుర్తించిన 263 రాజీపడదగు పెండింగ్ కేసుల్లోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రీ లిటిగేషన్ ఎలక్ట్రిసిటీ కేసులు 2,047, బ్యాంకుకు సంబంధించి 777, బీఎస్ఎన్ఎల్ 268, తదితర కేసులు ఉన్నాయన్నారు. హనుమకొండ జిల్లా కోర్టులో 8, పరకాల కోర్టులో ఒకటి మొత్తం 9 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, జిల్లాలో గుర్తించిన 1,277 రాజీపడదగు పెండింగ్ కేసుల్లో కక్షిదారులకు నోటీసులు జారీ చేసినట్లు,ఇందులో ప్రీ లిటిగేషన్ కేసులు 190, బీఎస్ఎన్ఎల్ 231 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపు రుద్రమ సాహిత్య సభలు

హన్మకొండ కల్చరల్ : కాకతీయ రుద్రమ పేరున దశాబ్దం క్రితం ప్రారంభించిన రుద్రమ ప్రచురణలు ఆధ్వర్యంలో రుద్రమ సాహిత్య సభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రజిత, రామలక్ష్మి తెలిపారు. ఆదివారం ఉదయం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో జరిగే సమావేశాల్లో రచయిత్రులు రాసిన ఐదు పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందని, ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, బీవీఎస్.స్వామి, తిరునగరి దేవకి, వీఆర్.విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–15 చెస్ పోటీలను ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారం.. వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యాన హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడకారులు 2009 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని, పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి ఉడ్ బాల్ పోటీల్లో నర్సింహ ప్రతిభ



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన క్రీడాకారుడు పానుగంటి నర్సింహ 18వ జాతీయ స్థాయి సీనియర్ ఉడ్ బాల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటాడు. ఈ నెల 10, 11 తేదీల్లో మహారాష్ట్రలోని నాగపూర్‌లో 18వ జాతీయ స్థాయి సీనియర్ ఉడ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఇందులో నర్సింహ తెలంగాణ తరఫున జాతీయ స్థాయిలో పాల్గొని తృతీయ స్థానం సాధించాడు. కాగా, ఉడ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందిక ఆదర్శ్, కోచ్ బాలబోయిన సందీప్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు.. నర్సింహను అభినందించారు.

పసుపు @ రూ.14,122

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు శుక్రవారం రికార్డు ధర లభించింది. ఇటీవల పసుపు క్వింటాకు ధర రూ.12వేల వరకు పలుకగా.. ప్రస్తుతం మార్కెట్‌కు కొత్త పసుపు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ట ధర రూ.14,122 పలికింది. గడిచిన పదేళ్ల తర్వాత ఇంత ధర పలకడం ఇదే మొదటిసారి అని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. రైతుల సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచి ధర లభించడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట : మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమశాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ–సీశాట్–2025 (సివిల్స్) కోసం దరఖాస్తు చేసుకున్న మైనారిటీ (ముస్లి, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శి)అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మైనారిటీ సంక్షేమాధికారి సౌజన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను హనుమకొండ సుబేదారి షరిఫన్ మసీద్ ఎదుట గల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9963978386, 0870–298 00533 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హత్యాయత్నం ఘటనలో వ్యక్తి రిమాండ్

కన్నాయిగూడెం : హత్యాయత్నం ఘటనలో ఓ వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలోని రాజన్నపేట జీపీ పరిధిలోని గంగాగూడేనికి చెందిన కావిరి రవీందర్‌ను అదే గ్రామానికి చెందిన కావిరి ప్రమోద్ విద్యుదాఘాతంతో చంపడానికి యత్నించాడు. ఈ ఘటనపై రవీందర్ భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమోద్‌ను శుక్రవారం రిమాండ్ తరలించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..





నేటి నుంచి 24 వరకు వేంకటేశ్వరస్వామి వారి జాతర

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

చిల్పూరు: భక్తుల కొంగుబంగారం.. తెలంగాణలో రెండో తిరుమల తిరుపతి దేవస్థానంగా పేరుగాంచిన చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. శనివారం (నేటి) నుంచి ఈ నెల 24వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతి సంవత్సరం శోభాకృతి నామ సంవత్సరం పాల్గుణ శుద్ధ సప్తమి రోజు నుంచి పౌర్ణమి వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో నేటి నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు..

నేడు తొళక్కముతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం. 21న ఎదుర్కోళ్లు, 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవం, 24న చక్రస్నానంతో ముగింపు నిర్వహిస్తారు.

ఇలా చేరుకోవచ్చు..

భక్తులు వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని చిన్నపెండ్యాల గ్రామ బస్‌స్టేజీ ఆర్చి వద్ద దిగాలి. ఇక్కడి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో చిల్పూరు ఆలయం ఉంటుంది. ప్రైవేట్ వాహనాలు, ఆటోల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎండోమెంట్, దాతల సాయంతో సౌకర్యాలు కల్పిస్తున్నాం. మంచినీరు, క్యూలైన్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశాం

-లక్ష్మీప్రసన్న, ఆలయ ఈఓ

స్వామివారి ఆశీస్సులు పొందాలి



బుగులు వేంకటేశ్వర స్వామివారి కల్యాణం మంచి ముహూర్తంలో వచ్చింది. భక్తులు కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలి.

- రవీందర్‌శర్మ, అర్చకుడు

స్థల పురాణం..

పూర్వకాలంలో వేంకటేశ్వరస్వామి వారు పద్మావతి అమ్మవారిని వివాహమాడే సమయంలో కుబేరుడి వద్ద అప్పు తీసుకుంటాడు. వేల సంవత్సరాలైనా తీసుకున్న అప్పు, వడ్డీ చెల్లించలేక బుగులుతో చిల్పూరు గుట్టల మధ్య పాదాలు మోపుతాడు. అయినా ఎవరైనా వస్తారనే అదే బుగులుతో ఇదే కొండపై ఎత్తైన ప్రదేశంలోని గుహలో తలదాచుకుని స్వయం భూవలయుడిగా వెలిశాడు. ఆ సమయంలో ఇదే కొండపై మునులు, రుషులు నైరుతి భాగంలో ఉన్న కోనేరులో స్నానాలు చేసి స్వామి వారు వెలిసిన ప్రదేశంలో తపస్సు చేసుకునే వారు. ఈ విషయం కాకతీయుల సామ్రాజ్యంలో ఓరుగల్లు పట్టణాన్ని పాలించే రాజుకు తెలుస్తుంది. వెంటనే గ్రామస్తుల సహకారంతో అక్కడికి చేరుకుంటాడు. 14వ శతాబ్దంలో స్వామి వారు విడిచిన పాదాల గుండు వద్ద ఆలయం నిర్మించారు. ఆలయం చిన్నగా ఉండడంతో 1999లో చినజీయర్ స్వామి చేతుల మీదుగా పాంచరాత్ర ఆగమ శాస్త్ర శ్రీవైష్ణవి సాంప్రదాయ ప్రకారం గుడిని విశాలంగా చేపట్టారు. ప్రస్తుతం కొండపై వరకు ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు మెట్లను, ఆలయ ముందు దాదాపు రూ. కోటి స్వంత ఖర్చులతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేశారు. మరో విశేషం ఏమంటే ఈగుహలో నేటికి అఖండ దీపం వెలుగుతూనే ఉంటుంది.

రేపటి నుంచి కొమ్మాల జాతర



మొరం పోసి విస్తరించిన జాతర ప్రధాన రహదారి



కొనసాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు

- 21న స్వామివారి కల్యాణోత్సవం
- గుట్ట వద్ద వేగంగా సాగుతున్న పనులు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు 17 నుంచి ప్రారంభమై ఈ నెల 31వ తేదీన ముగుస్తాయి. కాగా, ఆదివారం రాత్రి 8 గంటలకు అధ్యయనోత్సవంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అలాగే ఈ నెల 21న రాత్రి పది గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 25న హోలీ పండుగ నుంచి జాతర ప్రారంభం అవుతుందని, అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో శేషగిరి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు.

వేగంగా జరుగుతున్న జాతర పనులు

జాతర విజయవంతానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే రూ. 60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో గుట్ట పరిసర ప్రాంతంలో మూడు చోట్ల మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కిలో మీటర్ మేర ఆలయ ప్రధాన రహదారికి రెండు వైపులా సుమారు రూ. 10 లక్షలతో మొరం పోసి విస్తరించారు. దీనిపై కంకర చిప్స్‌తో రోలింగ్ పనులు చేపడుతున్నారు. రూ. 7 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, రూ. 10 లక్షలతో గుడి నుంచి నాచినపల్లి వరకు మొరం పోసి రోడ్డును చదును చేస్తున్నారు. 50 సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసే పనులు జాతర ప్రారంభం నాటికి పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కాగా, ఈ సారి జాతరలో రాజకీయ ప్రభలకు పార్టీ జెండాలు లేకుండా అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. దీనిపై పోలీసులు గట్టు వద్ద రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.అలాగే, ఉత్సవ కమిటీ ఏర్పాటు విషయంలో ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. శనివారం ఉదయం నాటికి కమిటీ ఏర్పాటు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

రూ.2 కోట్లతో మద్యం వ్యాపారి పరార్

- ఐపీతో వ్యాపారుల షాక్

జనగామ: జనగామ పట్టణానికి చెందిన ఓ మద్యం వ్యాపారి, బీఆర్ఎస్ నాయకుడు రూ. 2 కోట్ల మేర అప్పులు చేసి కుటుంబంతో సహా పరారయ్యాడు. అప్పు ఇచ్చిన బాధితులు సదరు వ్యాపారి రెండు రోజుల క్రితం ఐపీ పెట్టి బిచానా ఎత్తేయడంతో లబోదిబోమంటున్నారు. అధిక వడ్డీలకు ఆశపడిన వ్యాపారులు చివరకు మోసపోయారు. గతంలో జరిగిన ఘటనలను చూసిన వారు ఏమాత్రం మారడం లేదు. రూ. 3 నుంచి రూ. 5 చొప్పున వడ్డీలకు ఇస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. రెండు రోజుల క్రింత పరారైన మద్యం వ్యాపారి సుమారు 26 మందికి సంబంధించి రూ.2 కోట్లకు ఐపీ దాఖలు చేశారు. దీంతో ఈ విషయం జనగామలో చర్చనీయాంశంగా మారింది. సదరు వ్యక్తి కోసం బాధితులు ఆరా తీస్తుండగా.. ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు మాట్లాడుకుంటున్నారు. అతడి ప్రాపర్టీస్ ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై కూపీ లాగుతుండగా... వాటికి సంబంధించి కూడా బాకీ కింద ఉన్నట్లు సమాచారం.

కిలాడీ దంపతుల అరెస్ట్

ఆస్తులు ఉన్నట్లు నమ్మించి ఘరానా మోసం

- రూ. 1.94 కోట్ల నగదు, రూ.25 లక్షల విలువైన బంగారం వసూల్
- వివరాలు వెల్లడించిన సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: ఆస్తులు ఉన్నట్లు నమ్మించి కోట్ల రూపాయలు వసూల్ చేసి మోసం చేసిన హెడ్ కానిస్టేబుల్ దంపతులను అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లాలో ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఖాసీం, అతడి భార్య సహీదా.. ధర్మసాగర్ మండలం ముల్కలపల్లికి చెందిన బాధితురాలు ఓదెల లక్ష్మికి 2019 సంవత్సరంలో గోపాల్‌పూర్ భద్రకాళి కాలనీలో ఓ గృహం చూపించి విక్రయిస్తామన్నారు. దీంతో బాధితురాలు సరే అనగా ఆమె వద్ద నుంచి రూ. 50 వేల అడ్వాన్స్ తీసుకున్నారు. అనంతరం మరో రూ. 3.50 లక్షలు బ్యాంక్ ద్వారా పొందారు. కొద్ది రోజుల తరువాత సదరు గృహం వారిది కాదని బాధితురాలికి నిజం తెలిసి డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా ఇవ్వలేదు. దీంతో ఇటీవల బాధితురాలు వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీంతో సీపీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారించగా హెడ్‌కానిస్టేబుల్ దంపతులు లేని ఆస్తులు ఉన్నట్లు చూపించి..నమ్మించి మరో ఐదుగురి నుంచి రూ.1.94 కోట్లు వసూల్ చేశారు. దీంతో పాటు రూ.25 లక్షల విలువైన 430 గ్రాముల బంగారం వసూల్ చేశారు. విచారణలో నిందితులు నిజం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కాగా, హెడ్ కానిస్టేబుల్ దంపతులపై గతంలో హనుమకొండ, మిల్స్‌కాలనీ, కాజీపేట, సుబేదారి, ధర్మసాగర్ పీఎస్‌లలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

- పలువురి ప్రయాణికులకు గాయాలు
- మల్లంపల్లి క్రాస్ వద్ద ఘటన

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–కాటారం జాతీయ ప్రధాన రహదారిపై మల్లంపల్లి క్రాస్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కాటారం వైపు నుంచి భూపాలపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సును కాటారం వైపునకు వెళ్తున్న డీసీఎం ఢీకొంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మహాముత్తారం మండలం కనుకునూరుకు వెళ్లి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో మల్లంపల్లి క్రాస్ సమీపంలో భూపాలపల్లి వైపు నుంచి వస్తున్న డీసీఎం.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో డ్రైవర్ శ్రీనివాస్‌తో పాటు నలుగురు తీవ్రంగా, మరో 11 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి తీవ్రంగా గాయపడిన వారిని వరంగల్‌కు తరలించారు. ఆదివారంపేటకు చెందిన అతుకూరి సమ్మక్క, లావణ్య(ములుగుపల్లి), రాజేశ్వరి(కాటారం), లక్ష్మి (ముప్పారం) గ్రామాలకు చెందిన ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కండక్టర్ ఎండీ హమీద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. కాగా, క్షతగాత్రులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌ను ఆదేశించారు.



గాయాలపాలైన ప్రయాణికులు

'కౌశిక్‌రెడ్డి చేతికి కల్యాణలక్ష్మి చెక్కులు పోవద్దు'

- తహసీల్దార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌ఆదేశించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో

కమలాపూర్: 'హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మా పార్టీ వాడు కాదు.. ఆయన చేతికి ఒక్క కల్యాణలక్ష్మి చెక్కు కూడా పోవద్దు..' అంటూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. కమలాపూర్ తహసీల్దార్ పాలకుర్తి మాధవిని ఫోన్‌లో ఆదేశించారంటూ ఓ ఆడియో శుక్రవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఆడియో పూర్తి సారాంశం ఇలా ఉంది. ఎమ్మార్వో గారు.. నా నంబర్ లేదా తల్లి.. నేను పొన్నం ప్రభాకర్.. ఇది నా అధికారిక నంబర్ ఫీడ్ చేసుకో.. ఆర్డీఓ గారు లైన్లో ఉన్నారు.. మళ్ల నా దృష్టిలో పెట్టేది ఏం లేదు.. ఎమ్మార్వో గారు.. మొన్నటి దాక హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉంటే అధికార పార్టీలో ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్‌రెడ్డి ద్వారా కల్యాణలక్ష్మి చెక్కులు పంపిచ్చిండ్లు మీరు.. ఇప్పుడు మా వోడికి ప్రొటోకాల్ లేదు. ఎమ్మెల్సీ కాదు మా కంటెస్టెడ్ క్యాండిడేట్ ప్రణవ్.. ఎమ్మెల్యే మా పార్టీ వాడు కాదు. మీకే స్వేచ్ఛనిస్తున్నాం.. మీరే పంచండి.. ఆయన చేతికి ఒక్క చెక్కు కూడా పోవద్దని చెప్తున్నా.. ఒక్క చెక్కు కూడా ఆయన చేతికి పోవద్దు.. మీరే స్వయంగా, అవసరమైతే స్థానిక సర్పంచ్‌లు, వాళ్లనో, వీళ్లనో తీసుకొని పోయి లోకల్‌లో ఇచ్చేసుకోండి'.. అంటూ పేర్కొన్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ విషయంపై తహసీల్దార్ మాధవిని వివరణ కోరగా 'నాకు ఎవరూ ఫోన్ చేయలేదు.. అది నా వాయిస్ కాదు.. ఇది ఎవరు చేశారో, ఎందుకు చేశారో ఆరా తీయాలని స్థానిక సీఐని కోరాను'.. అని పేర్కొన్నారు.

భువనేశ్వర్ టు మహారాష్ట్ర

- 61.1 కేజీల ఎండు గంజాయి పట్టివేత
- బిహార్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య



పట్టుబడిన గంజాయిని చూపుతున్న మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి మహారాష్ట్రకు భారీ ఎత్తున తరలిస్తున్న ఎండు గంజాయిని మిల్స్‌కాలనీ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ రైల్వేస్టేషన్ శివనగర్ వైపు రహదారిపై మిల్స్‌కాలనీ ఎస్సై మున్నీరిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 15,27,500 విలువైన 61.1కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కేసు వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రాఘువపూర్ తానా, మల్లిక్ పూర్ గ్రామానికి చెందిన మున్నాకుమార్, మిథున్‌కుమార్ మహా రాష్ట్రలోని పూణెలో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశాలోని భువనేశ్వర్‌కు వెళ్లారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి వద్ద రూ.5వేలకు కిలో చొప్పున 63 కేజీల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని ప్యాకెట్ల రూపంలో బ్యాగులో పెట్టుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి పుణెకు బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్‌కు సమీపంలో రైలులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా భయాందోళనకు గురైన ఇద్దరు గురువారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు శివనగర్ రహదారిపైకి చేరుకున్నారు. అదే సమయంలో మిల్స్‌కాలనీ ఎస్సై మున్నీరిల్లా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి బ్యాగులతో ఆటో కోసం వేచిచూస్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 15,27,500 విలువైన 61.1కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి శుక్రవారం ఇద్దరని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఎస్సై గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ పీఎస్ పరిధిలో 17 కిలోలు..

హసన్‌పర్తి: కేయూ పోలీసులు 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2.53 లక్షలు ఉంటుందని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి చెప్పారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఏటూరునాగారానికి చెందిన కేతిరి డేవిడ్, నెక్కొండకు చెందిన పొనగంటి రుత్విక్ గంజాయి వ్యాపారులు. వీరిద్దరు భూపాలపల్లికి చెందిన పెండ్యాల పవన్ వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. ఈక్రమంలో గంజాయిని కొనుగోలు చేసుకుని బైక్‌పై ఏటూరునాగారం నుంచి జాతీయ రహదారి మీదుగా హనుమకొండ వైపునకు బయలుదేరారు.

తనిఖీలు..అరెస్ట్

కాగా, శుక్రవారం రెడ్డిపురం క్రాస్ వద్ద ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అయితే డేవిడ్, రుత్విక్.. పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని ఆ బ్యాగ్‌ను తనిఖీ చేయగా తొమ్మిది ప్యాకెట్‌ల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ చెప్పారు. గంజాయి అమ్ముతున్న పవన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

విషజ్వరంతో మహిళ మృతి



సరిత (ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని ఇంచెంచెరువుపల్లి గ్రామానికి చెందిన నునావత్ సరిత (34) విష జ్వరంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. సరిత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ములుగులోని ప్రైవేటు ఆసుపత్రిలో మూడు రోజులు చికిత్స పొందింది. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో సరితకు విషజ్వరంతో పాటు లివర్, కిడ్నీ సమస్య కూడా ఎక్కువ కావడంతో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త మోహన్‌దాస్, ఇద్దరు కూతుళ్లు వర్షిత, వైష్ణవి ఉన్నారు. కాగా, తల్లి మృతదేహంపై పడి అమ్మా లే.. అమ్మా లే అంటూ కూతుళ్లు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

మానుకోటలో గుర్తుతెలియని వ్యక్తి ..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని గర్భగుడి ఆసుపత్రి వెనుక ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. మృతుడి శరీరంపై దుస్తులు సరిగాలేవని, గోధుమ రంగు నెక్కరు, ఆకుపచ్చ రంగు చెప్పులు మాత్రం ఉన్నాయన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. దీంతో మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పోస్టుమార్టం గదికి తరలించి భద్రపరిచామని, ఎవరైనా గుర్తిస్తే టౌన్ పోలీసులకు (87126 56930) సమాచారం ఇవ్వాలన్నారు.

చొక్కా చించి.. ఫైళ్లు విసిరేసి

నాయబ్ తహసీల్దార్‌పై దాడి

- అడ్డొచ్చిన సిబ్బందిపై కూడా..
- రిజిస్ట్రేషన్ ఎలా చేశారంటూ నిలదీత
- ఉద్రిక్తత.. 13 మందిపై పీఎస్‌లో ఫిర్యాదు



నాయబ్ తహసీల్దార్ జగన్‌పై దాడి చేస్తున్న దృశ్యం



నాయబ్ తహసీల్దార్ చొక్కా చిరిగి పోగా, చిందర వందరగా పడి ఉన్న ఫైల్స్

జనగామ: భూ రిజిస్ట్రేషన్ వివాదంలో నాయబ్ తహసీల్దార్‌పై దాడి జరిగింది. ఈ ఘటన శుక్రవారం జనగామ తహసీల్ కార్యాలయంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండా తల్లి సహకారంతో సోదరి పేరిట రిజిస్ట్రేషన్ ఎలా చేశారంటూ నాయబ్ తహసీల్దార్ సీహెచ్.జగన్‌తో ఘర్షణకు దిగారు. ఆవేశం ఆపుకోలేక చొక్కా పట్టి చించి.. టేబుల్‌పై ఫైల్స్ విసిరేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండలం వడ్లకొండకు చెందిన ముల్కల పోషమ్మకు ఏడుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. గ్రామంలోని 645/2 సర్వే నంబర్‌లో ఆమె పేరిట 20 గుంటల భూమి ఉంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చేరదీసే క్రమంలో భూమికి సంబంధించిన పంచాయితీ గతంలో పెద్ద మనుషుల వద్దకు వెళ్లినట్లు తెలిసింది. అప్పటి నుంచి పంచాయితీ కొనసాగుతుండగా.. ఈ ఏడాది జనవరి 27న పోషమ్మ.. తన కూతురు పేరిట భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని తహసీల్ కార్యాలయానికి వెళ్లింది. పోషణ విషయంలో కొడుకులు పట్టించుకోవడం లేదని, కూతురు సుజాత వద్దనే ఉంటున్నట్లు రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. పట్టాదార్ పుస్తకం కనిపించకపోవడంతో.. తన ఇష్టపూర్వకంగా రాసిచ్చిన లెటర్ ఆధారంగా కూతురుకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని మరో కుమారుడు చంద్రయ్యతో కలిసి అధికారులను కోరారు. కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి సమస్య వచ్చినా తాను చూసుకుంటానని ఇచ్చిన హామీ మేరకు నాయబ్ తహసీల్దార్ గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. సమాచారం అందుకున్న మిగతా కుటుంబ సభ్యులు నాలుగు రోజుల నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ రిజిస్ట్రేషన్ ఎలా చేశారంటూ నాయబ్ తహసీల్దార్‌ను నిలదీస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకుని, లిఖిత పూర్వకంగా లెటర్ రాసి ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ ఆపే అధికారం తమకు లేదని నాయబ్ తహసీల్దార్ వారితో చెబుతున్న క్రమంలో.. ఆయనపై దాడి చేశారు. చొక్కా పట్టి లాగుతూ టేబుల్‌పై ఉన్న పేపర్లను చించి వేశారు. దాడిలో నాయబ్ తహసీల్దార్ చొక్కా చిరిగి పోగా.. అప్రమత్తమైన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో ఆఫీసు సబార్డినేటర్లు అంజమ్మ, ఈశ్వరమ్మ, వీఆర్ఏ బాలరాజు.. నాయబ్ తహసీల్దార్‌కు రక్షణగా వెళ్లడంతో వారిపై కూడా దాడికి దిగారు. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో సిబ్బంది వడ్లకొండవాసులకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించేయడంతో గొడవ సద్దు మణిగింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వెంకన్న దాడి విషయమై కలెక్టర్, రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్‌కు వివరించడంతోపాటు విధులకు ఆటంకం కలిగిస్తూ దాడి చేసిన 13 మందిపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకన్న మాట్లాడుతూ స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ వస్తే ఆపే అధికారం తమకు లేదని, కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉంటనే రిజిస్ట్రేషన్ నిలిపివేస్తామని చెప్పారు. తల్లి రాసిచ్చిన లెటర్, కుమారుడు చంద్రయ్య సాక్షి సంతకంతో కూతురుకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు.

13 మందిపై కేసు

జనగామ తహసీల్ కార్యాలయంలో శుక్రవారం నాయబ్ తహసీల్దార్ జగన్‌పై దాడి చేసిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.